క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రం కౌతాళంతో పాటు మండలంలోని అగసలదిన్నె గ్రామంలో, బుదుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా విశేష పూజలు జరిగాయి.

కొనసాగుతున్న కార్మికుల దీక్ష


పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు వంట వార్పు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: సమస్యల సాధనకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు 39 రోజులుగా చేపట్టిన దీక్ష కొనసాగింది. ఇందులో భాగంగా కార్మికులు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటవార్పు చేసి నిరవధిక దీక్ష చేపట్టారు. యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

పైప్ లైన్ పరిశీలన


నీరు కలుషితమవుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మహబూబ్ నగర్ కాలనీలో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందనే ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నీరు కలుషితం కావాడానికి కారణమైన పైప్‌లైన్‌ను వెంటనే తొలగించి వేరే పైప్‌లైన్ వేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే.. సమీపంలోని కోళ్ల ఫారం వ్యర్థాలు డ్రైన్ ద్వారా వస్తున్నాయని స్థానికులు చెప్పడంతో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యోగాతో ఎన్నో ఉపయోగాలు


బాలుర జూనియర్ కళాశాల మైదానంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: యోగా చేయడం ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని, యోగాను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,తహసీల్దార్ శేషఫణి, నోడల్ అధికారి స్వర్ణలత సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు,ఉపాధ్యాయులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. బాలికల హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ


రీతు అక్షయ (ఆలిండియా ర్యాంక్ 8938)


వెంకటసాయి గుప్త (ఆల్ఇండియా ర్యాంక్ 5617)

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్‌లో ప్రతిభ చాటారు. కురువ రీతు అక్షయ అనే విద్యార్థిని ఆలిండియాలో 8,938 ర్యాంక్ సాధించగా.. ఓబీసీ కేటగిరిలో 3,684 ర్యాంక్‌ను సాధించింది. మరో విద్యార్థి గ్రంథే వెంకటసాయి గుప్త ఆలిండియా 5,617వ ర్యాంక్ సాధించాడు. దీంతో శనివారం విద్యార్థిని రీతు అక్షయను తండ్రి కురువ మద్దిలేటి,తల్లి కురువ మంజుల అభినందించి స్వీట్లు తినిపించారు.అలాగే.. గ్రంథే వెంకటసాయి గుప్తకు తల్లిదండ్రులు పోస్టల్ ఏజెంట్ గ్రంథే విజయమోహన్ రావుతో పాటు స్థానిక ఆర్యవైశ్య సంఘ పెద్దలు అభినందించారు.

చేగువేరా జయంతి

ఎమ్మిగనూరుటౌన్: తేరుబజార్‌లో శనివారం చేగువేరా జయంతిని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సురేష్, మాజీ నాయకులు గోవిందులు పూలమాల వేసి నివాళుల ర్పించారు. నాయకులు రాకేష్, భీమేష్, మణికంఠ,వీరేష్ పాల్గొన్నారు.

కరుణించని 'కూటమి'

- అన్నదాతలకు కరువైన ప్రభుత్వ సహకారం
- సబ్సిడీ విత్తు పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- అప్పులు ఊబిలో కొన'సాగు'తున్న అన్నదాతలు

కర్షకుడిపై కూటమి సర్కారు కరుణ కరువైంది. ముందస్తు వర్షాలు ఊరిస్తున్నా పొలాల్లో సందడి కాస్త నెమ్మదిగానే ఉంది. కొందరు రైతులు అప్పోసప్పో చేసుకుని సేద్యాలకు సన్నద్ధమయ్యారు. మరికొందరు విత్తు సైతం వేసుకుంటున్నారు. ఆర్థిక భరోసా లేకపోవడంతో రైతన్నలు వడ్డీ వ్యాపారుల చెంత కునారిల్లుతున్నారు. ప్రాధేయపడి సాగు పనులకు పూనుకుంటున్నారు. ఇంతగా రైతన్నలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నా కూటమి ప్రభుత్వానికి సోయి లేకపోయింది. అన్నదాతల ఆపసోపాలను కనులారా చూస్తూ మిన్నకుండి పోయింది. నిరుడు ఏరువాక రైతన్నలకు నష్టాల మూట గట్టింది. ఈ ఏడాది ఏరువాక మునుపే మందకొడిగా సాగుతోంది.

– మంత్రాలయం

వ్యవసాయ విస్తీర్ణం	1,82,115 ఎకరాలు
ఆయకట్టు	57, 919 ఎకరాలు
వర్షాధారం	1,20,552 ఎకరాలు
మొత్తం రైతులు	45, 173 మంది

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 1,82,115 ఎకరాల సాగుభూమి ఉంది. వర్షాధారం కింద 1,20,552 ఎకరాలు ఉంది. తుంగభద్ర దిగువ కాలువ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ ప్రాజెక్టు, బోరుబావుల కింద 57, 919 ఎకరాలు సాగవుతోంది. ఇక్కడ ప్రధాన వాణిజ్య పంటగా పత్తి సాగవుతుండగా వేరుశనగ, వరి రెండవ ప్రధాన పంటలు ఉన్నాయి.

భరోసాకు నీళ్లు

కూటమి ప్రభుత్వం మొదటి ఏటనే వ్యవసాయ రంగం కళ పతనమైంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో అన్నదాతలు కష్టాల సేద్యాన్ని కొనసాగించారు. అన్నదాత సుఖీభవ కింద నియోజకవర్గంలో 45,209 మందికి గానూ రూ.90,41, 80,000 రావాల్సి ఉండగా పైసా విదిల్చలేదు. కనీసం పండిన పంటలకు గిట్టుబాట ధర కల్పించలేదు. ముఖ్యంగా మిరప, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మిరప క్వింటా సరాసరి రూ.20 వేలకు పైగా ధర పలికింది. వరి క్వింటా రూ.2,800–3,200 వరకు రికార్డుస్థాయిలో ధరలు లభించాయి. ఇక పత్తి క్వింటా రూ.7–9 వేల వరకు ఉండగా నిరుడు మాత్రం రూ.6 వేల లోపు పలకడం నిజంగా శోచనీయం.

పరిహారానికి తూట్లు

అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులకు పంటలు చేతికి రాకపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఠంచన్‌గా పరిహారం మంజూరు చేసింది. పంటనష్ట పరిహారమే కాకుండా దెబ్బతిన్న పంటలకు పంటబీమా కూడా వర్తింపజేసింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం పరిహారానికి తూట్లు పొడించింది. ప్రకటనలకు పరిమితమై అన్నదాతల ఎదురుచూపులకు తావు వేసింది. నిరుడు కరువు మండలాలను ప్రకటించిన కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ విదల్చలేదు. నియోజకవర్గంలో పెద్దకడబూరు, కౌతాళం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. కౌతాళం మండలంలో 17,580 మందికిగానూ రూ.16 కోట్లు, పెద్దకడబూరు మండలంలో 9,560 మందికిగానూ రూ.8.30 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. ఇక 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి బాధిత రైతులను ఆదుకునేందుకు పంటనష్ట పరిహారం మంజూరు చేసింది. ఎన్నికలకు వెళ్లడంతో సగం మంది రైతులకు నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఆ నిధులకు కన్నం వేసింది. రైతుల ఖాతాల్లో పరిహారాన్ని జమ చేయకుండా చేతులెత్తేసింది. నియోజవర్గంలో మంత్రాలయంలో 1800 మంది రైతులకు రూ.2.43 కోట్లు, పెద్దకడబూరులో 460 మందికి రూ. 1.60 కోట్లు, కోసిగిలో 370 మందికిగానూ రూ.39.02 లక్షలు పెండింగ్‌లో పెట్టింది.


పత్తి విత్తులో కూలీలు


పత్తి విత్తు కోసం దుక్కి చేస్తున్న రైతన్న

సందడి లేమితో పొలంబాట

ముందస్తు వానలు రావడంతో రైతులు ఇప్పటికే విత్తు వేయడానికి సమాయత్తమయ్యారు. నియోజకవర్గంలో 2,900 ఎకరాల్లో ఇప్పటికే పత్తి విత్తు వేశారు. బోరుబావుల కింద ఉల్లిసాగు ఊపందుకుంది. నియోజకవర్గంలో 1000 ఎకరాల్లో ఉల్లి సాగైంది. ప్రభుత్వ సహకారం కొరవడటంతో పొలంబాటలో కళ తగ్గింది. దుకాణాల్లో ఆథరైజ్డ్ పత్తి విత్తనాలు కొనలేక కేజీ రూ.వెయ్యి చొప్పున బయట లూజ్ పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఇక విత్తన, ఎరువుల డీలర్ల షాపులపై అధికారుల పర్యవేక్షణ లేకపోయింది. వేరుశనగ 405 టన్నులకు గానూ కేవలం 95 టన్నులకు మించి రాలేదు. విత్తు విపత్తు కూడా రైతులకు శాపంగా మారింది.

అప్పులతోనే సాగు



కూటమి ప్రభుత్వం రైతులకు పైసా సాయం చేయలేదు. కనీసం పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదు. దాదాపు 100 బస్తాలు ఏసీలోనే పెట్టాను. నేటికీ ధర లేక అమ్ముకోలేదు. ప్రస్తుతం పంటలు వేసుకునేందుకు బయట వ్యాపారులతో అప్పులు తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ఇవ్వకుండా రైతులను నిలువునా మోసం చేసింది. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఎలా గట్టెక్కాలో తోచడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి.

– నరసింహారెడ్డి, రైతు

మెలకువలు పాటించాలి



సాగులో ప్రతి రైతు వ్యవసాయ శాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా క్యాష్ బిల్లులు తీసుకోవాలి. బయట డీలర్లతో ఎటువంటి పరిస్థితుల్లో లూజు విత్తనాలు కొనుగోలు చేయరాదు. వానలు బాగానే కురుస్తున్నాయి. విత్తు వేసుకునేందుకు ఇదే అనుకూల సమయం . ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

– జీరా గణేష్, వ్యవసాయాధికారి

20లక్షల ఉద్యోగాలు ఇచ్చేదెన్నడు?

ఎమ్మిగనూరుటౌన్: సీఎం చంద్రబాబునాయుడు 20 లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారని, అలాగే..నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎన్నడు అందజేస్తారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు ప్రశ్నించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అవి సాధ్యంకాని పక్షంలో రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీలను ఎన్నడు అమలు చేస్తారని నిలదీశారు. 2014 ఎన్నికల ముందు ఇలాగే హామీలు ఇచ్చి అమలు చేయలేకపోయారని గుర్తు చేశారు. ఆదివారం నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, మండల నాయకులు భాస్కర్, ఇస్మాయిల్,వీరేష్,కృష్ణ పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన విద్యార్థిని


రేచల్ విక్లిఫ్

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన జొనాథన్ విక్లిఫ్, సంధ్యరాణి దంపతుల కుమార్తె రేచల్ విక్లిఫ్ నీట్ ఫలితాల్లో మెరిసింది. ఆల్ ఇండియాలో 7178 ర్యాంకు, ఓసీ కేటగిరిలో 3355 ర్యాంకు (మార్కులు 564/720) సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలో మంచి ర్యాంకు రాకపోవడంతో గతేడాది విజయవాడలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నానన్నారు. డాక్టర్ అయి పేదలకు మెరుగైన వైద్యం అందించడమే తన లక్ష్యమని తెలిపింది.

జెండా ఆవిష్కరణకు స్థల పరిశీలన

ఆదోని రూరల్: జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, మందకృష్ణ మాదిగ జన్మదినాలను పురస్కరించుకుని మండలంలోని ప్రతి వార్డులో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేస్తామని ఎమ్మార్పీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ గుమ్మల బాలస్వామి మాదిగ, కో ఇన్‌చార్జ్ సుధాకర్, పట్టణ కన్వీనర్ వన్నెల మణికంఠ తెలిపారు. శనివారం వారు జెండా ఆవిష్కరణకు పట్టణంలోని శంకర్‌నగర్‌లో స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, అయ్యప్ప, అంజి, వీరేష్, పరశురాముడు, నాగరాజు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి


రక్తదానం చేసిన వారితో డాక్టర్లు, సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు శ్రీచరణ్,మల్లికార్జున, చిరంజీవి, భార్గవి, వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా యువకులు స్వచ్ఛందగా వచ్చి రక్తదానం చేశారు. డాక్టర్లు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, ఆరోగ్యంగానే ఉంటారన్నారు. 22 మంది రక్తదానం చేసినట్లు వైద్యులు తెలిపారు.


కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉస్మాన్

ప్రాణదాతలుగా నిలవండి

గోనెగండ్ల: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సభ్యుడు, ఆర్ఎంపీల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఉస్మాన్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేసిన గోనెగండ్లకు చెందిన డాక్టర్ ఉస్మాన్‌కు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ


మాట్లాడుతున్న నూతన తహసీల్దార్

ఆదోని రూరల్: తహసీల్దార్ రమేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శివరాములు కలెక్టరేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో పత్తికొండ తహసీల్దార్ రమేష్ ఇక్కడికి వచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన రమేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన కురువ హనుమేష్

హాలహర్వి: కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా బిసినెల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతకుంట గ్రామానికి చెందిన కురువ హనుమేష్(36) మృతి చెందాడు. శనివారం బళ్లారి నుంచి ఆటోలో ఐరన్ రాడ్లు లోడ్ చేసుకుని వస్తుండగా బిసినెల్లి వద్ద కర్ణాటక బస్సు వేగంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బళ్లారి ఆసుపత్రికి తరలించారు.

పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా పనిచేయాలి


మాట్లాడుతున్న బుట్టా రేణుక

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని, అలాగే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక సూచించారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో నూతనంగా ప్రారంభించిన పార్టీ కార్యాలయాన్ని సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠతో కలిసి సందర్శించారు. ముందుగా పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆమెకు పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికి శాలువతో సన్మానించారు. అనంతరం మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బుట్టా రేణుక మట్లాడుతూ గ్రామీణ ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకోవడానికి మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు.సమస్యలను పార్టీ కార్యాలయంలో గానీ, నాయకులను గానీ తెలియజేస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల పక్షన నిలబడి పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ప్రజలను ఇంత మోసం చేసిన కూటమి ప్రభుత్వం లాంటిది దేశంలో మరొకటి లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో జగనన్న గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివిటీ కార్యదర్శులు నాగేష్ నాయుడు, బందెనవాజ్, తాలూకా బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ నాయుడు, మండల ఉపాధ్యక్షులు అల్లబకాష్, చికెన్‌రాజా, నాయకులు ఎస్‌బీ మన్సూర్, కాశీరెడ్డి, భాస్కర్ రెడ్డి, రవి కుమార్ నాయుడు, గోవింద్, నాయుడు, రఫీక్, జైపాల్ రెడ్డి, మహేష్ రెడ్డి, తోలు రాముడు, పెయింటర్ రహిమాన్, నదిముల్లా, ఖాజా పటేల్, పులికొండ, ఉస్మాన్ పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే విద్యాభివృద్ధి


డీఎస్సీ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో విద్యాభివృద్ధి జరిగిందని, లక్షకు పైగా సచివాలయ ఉద్యోగాలతో పాటు పలు ఉద్యోగాల కల్పన సాధ్యమైందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పేర్కొన్నారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ, పార్టీ నాయకులతో కలిసి వడ్డించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం అందిస్తున్నామని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, జిల్లా చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, అధ్యక్షుడు శివప్రసాద్, బీసీ విభాగం రాష్ట్ర నాయకుడు విరూపాక్షిరెడ్డి, జిల్లా నాయకులు యుకె రాజశేఖర్, సునీల్‌కుమార్, రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మినారాయణరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, నాయకులు మాబ్బాషా, గడ్డం అంజి, లతారెడ్డి పాల్గొన్నారు. అలాటే.. పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 7వ వార్డు పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ జేమ్స్, రాజు, ఉదయ్ ఆమెను కలిసి వార్డు సమస్యలను వివరించారు.

న్యాయవాదికి పరామర్శ

మంత్రాలయం మండలం మాలపల్లె గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ లీగల్ సెల్ న్యాయవాది గురురాజారావును శనివారం పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి బుట్టారేణుక, బుట్టా ఫౌండేషన్ అధ్యక్షుడు బుట్టా శివనీకలంఠ పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' వర్తింపజేయాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప

ఆదోని సెంట్రల్: స్కీం వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అడ్డగోలు షరతులతో కార్మికుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందన్నారు. షరతులు లేకుండా ప్రతి విద్యార్థికి పథకాన్ని వర్తింపజేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉత్తేజ్, సంజయ్, సంతోష్, లోకేష్, రాజు పాల్గొన్నారు.

అర్హులైనా.. అనర్హులే!

- తల్లికి వందనంలో ఇష్టారాజ్యంగా అనర్హులుగా ప్రకటింపు
- కొందరికే నగదు బదిలీ
- అర్హత ఉంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- సచివాలయాలకు పరుగులు తీస్తున్న తల్లులు


అర్హులైన తన పిల్లలకు పథకం సొమ్ము అందలేదంటున్న ఎమ్మిగనూరుకు చెందిన కె.షమీమ్

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంతమంది పిల్లలు పాఠశాలలకు వెళ్తుంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు అందిస్తామని కూటమి నాయకులు హామీనిచ్చారు. గద్దెనెక్కిన వెంటనే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉందంటూ ఏడాది కాలం గడిపేసింది. ఇప్పుడు తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ప్రకటించి అర్హతలున్న వారికి తల్లుల ఖాతాలకు రూ.15 వేలు జమ చేస్తామని చెప్పి అందులో రెండు వేలు కోత వేసి రూ.13వేలు జమ చేస్తామని ప్రకటించి తల్లుల ఖాతాలో జమ చేసింది. అయితే కొందరికి అర్హతలు లేవని అనర్హుల జాబితాలో చేర్చింది. అర్హ త ఉన్న వారికి సైతం పథకం వర్తించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు.. పాఠశాలలు, ఎంఈఓ లు, సచివాలయాల దగ్గరికి పరుగులు తీసి ఆరా తీస్తూ దుమ్మెత్తి పోస్తున్నారు.అయితే గ్రామ,వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రం మీ పిల్లల అర్హత పత్రాలు తెచ్చి ఇస్తే.. తరువాతి జాబితాలో పేర్లు నమోదు చేస్తామని చెప్పి పంపుతున్నారు.

నియోజకవర్గంలో వేలల్లో అనర్హులు..

ఎమ్మిగనూరు పట్టణంలో 16,430 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులైతే వారిలో పలు కారణాలతో 2,862 మందిని అనర్హులుగా ప్రకటించారు. అలాగే.. నందవరం మండలంలో 10,847 మంది విద్యార్థులు అర్హులుగా గుర్తించగా 855 మందిని అనర్హులుగా తేల్చారు. ఎమ్మిగనూరు మండలంలో 1664 మంది, గోనెగండ్ల మండలంలో 12,049మంది అర్హులు కాగా వారిలో 7,255 మంది విద్యార్థులను అనర్హులుగా ప్రకటించారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంట్లో చదివే ఒక విద్యార్థికి రూ.15వేలు అమ్మఒడి పథకం కింద ఐదేళ్ల పాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేశారు.

ఇల్లేలేదు.. మీటర్ రీడింగ్ 300 యూనిట్లని తొలగించారు

మాకు సొంతిల్లు లేదు.నా భర్త రఫీక్ ఓ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. మాకు ఇద్దరు పిల్లలున్నారు. వారిలో షేక్ అబ్దులా 8వ తరగతి, షేక్ అలీసా 7వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒకరికి అమ్మఒడి పథకం కింద రూ.15వేలు నా బ్యాంక్ ఖాతాకు జమ అయ్యాయి. ప్రస్తుతం సొమ్ము అందకపోవడంతో సచివాలయంలో విచారిస్తే.. 300 యూనిట్లు వినియోగిస్తుండటంతో నాన్ ఎలిజిబుల్ అని చూపిస్తుందని చెప్పారు.

– కె.షమీం, గృహిణి, ఎమ్మిగనూరు

నిబంధనలను తొలగించాలి



తల్లికి వందనంలో విద్యార్థుల సంఖ్యలో కోత విధించకుండా అందరికీ వర్తింపజేయాలి. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకొంటుంటే వారందరికీ రూ.15వేలు ఇస్తామని కూటమి పెద్దలు నాడు హామీనిచ్చారు. నిబంధన పేరుతో అనర్హులుగా ప్రకటించడం సరికాదు. నియోజకవర్గంలో వేలాది మందిని అనర్హులుగా ప్రకటించడాన్ని చూస్తే ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతోంది.

– బలరాం యాదవ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మిగనూరు

అర్హుల వివరాలు సరిచేస్తున్నాం



తల్లికి వందనం పథకం కింద అనర్హుల జాబితా పరిశీలించి వారికి పథకం వర్తించకపోవడాన్ని గుర్తించి వారి వివరాలను సేకరిస్తున్నాం. ఆధార్, బ్యాంక్ ఖాతాలు లాంటి వాటితో పాటు మరేవైన వివరాల్లో పొరపాట్లుంటే వాటిని సరిచేసి ఉన్నతాధికారులకు పంపుతాం. అర్హులై ఉంటే వారికి పథకం వర్తిస్తుంది.

– మధుసూదన్‌రాజు, ఎంఈఓ–2, ఎమ్మిగనూరు

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam. ap. gov. in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘానికి అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖకు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, కే.చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. అడ్‌హక్ కమిటీలో జి.అబ్దుల్‌హమీద్ (ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు డివిజన్), ఎం.నమేనాయక్ (ఎన్‌సీసీ కమాండెంట్), ఇలియాస్ బాషా (జిల్లా వ్యవసాయ అధికారి), పి.విజయకుమార్ (ఆర్‌డబ్ల్యూఎస్అండ్ ఎస్, జెడ్పీ), ఎస్.షబ్బీర్‌బాషా (సమాచార శాఖ) సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి వరకు ఉన్న కార్యవర్గం బైలాను పాటించడం లేదని రాష్ట్ర సంఘం గుర్తించి రాష్ట్ర సంఘం నేతలు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసింది. శనివారం అడ్‌హక్ కమిటీ సభ్యులు నియామక ఉత్తర్వులను ప్రదర్శించారు. అడ్‌హక్ కమిటీ సభ్యులైన అబ్దుల్ హమీద్ గతంలో జిల్లా సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర సంఘంలో కూడా కొనసాగుతున్నారు.